పచ్చదనం మాయం

- హైవే గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో ఆహ్లాదం కనుమరుగు
- గ్రీన్‌బెల్ట్ అభివృద్ధికి వేసిన శిలాఫలకం చుట్టూ మాయమైన చెట్లు
- ఒక్కొక్కటిగా చెట్లు తొలగించి ఆట స్థలాలుగా మార్చుతున్న వైనం
- అధికారుల నిర్లక్ష్యంతో ఆక్రమణలు, రక్షణ కరవు


శాంతిపురం పంజాబ్ డాబా వద్ద 1998లో గ్రీన్‌బెల్ట్ అభివృద్ధికి వేసిన శిలాఫలకం


సత్యం సెంటర్ వద్ద పచ్చదనం మాయమైన గ్రీన్‌బెల్ట్ ప్రాంతం


పంజాబ్ డాబా వద్ద చదును చేసిన గ్రీన్‌బెల్ట్ ప్రాంతం


గురుద్వారా పక్కన ఫెన్సింగ్ లేని గ్రీన్‌బెల్ట్


గ్రీన్‌బెల్ట్‌లో తగలబెడుతున్న చెట్ల కొమ్మలు

సీతంపేట: జాతీయ రహదారికి ఇరువైపులా విస్తరించి ఉన్న ఉత్తర నియోజకవర్గానికి గ్రీన్‌బెల్ట్ ప్రాంతం పచ్చదనంతో మణిహారంలా ఉండేది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసి ఆహ్లాదంగా మార్చారు. గ్రీన్‌బెల్ట్‌లో ఉన్న చెట్లు తొలగించకుండా పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, జిమ్‌లు, ఫ్లవర్ గార్డెన్‌తో అందంగా ప్రజలు సేద తీరేందుకు అనువుగా తీర్చిదిద్దారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రీన్‌బెల్ట్ ప్రాంతం నిర్లక్ష్యానికి గురవుతోంది. దీనిలోని చెట్లను ఒక్కొక్కటిగా నరికి చదును చేసి ఆట స్థలాలు మార్చివేస్తున్నారు. దీంతో గ్రీన్‌బెల్ట్‌లోని పచ్చదనం మాయమవుతోంది.

చెట్లను నరికి.. ఆట స్థలాలుగా మార్చి...

జీవీఎంసీ 25వ వార్డులో హైవేపై సత్యం సెంటర్ వద్ద ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని చదును చేసి షటిల్ కోర్టు ఏర్పాటు చేశారు. దాని పక్కనే ఉన్న గ్రీన్‌బెల్ట్‌లో చెట్ల కొమ్మలు ఒక్కొటిగా నరికి తగల బెడుతున్నారు. దానిని కూడా ఆట స్థలంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదే ప్రాంతంలో పంజాబ్ డాబా వద్ద గ్రీన్‌బెల్ట్‌లో చెట్లు మొత్తం తొలగించి ఆట స్థలంగా మార్చేశారు. స్థలం చుట్టూ నెట్ ఏర్పాటు చేశారు. గురుద్వారా సిక్కు మందిరం నుంచి పోర్ట్‌టౌన్ కూడలి వరకు ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతం పూర్తిగా మాయమైంది. ఫెన్సింగ్ లేక పూర్తిగా ఆక్రమణకు గురైంది. వ్యాపారులు తమకు అనుకూలంగా దీన్ని మార్చుకున్నారు.

శిలాఫలకం సాక్షిగా..

పర్యావరణ పరిరక్షణకు 1998–99 మధ్య కాలంలో విశాఖ నగర పాలక సంస్థ మేయర్‌గా ఉన్న సబ్బం హరి జాతీయ రహదారికి ఇరువైపులా మొక్కలు నాటి, వాటి రక్షణకు కంచె ఏర్పాటు చేసి గ్రీన్‌బెల్ట్‌గా తీర్చిదిద్దారు. 1998 జూన్ 1న మేయర్ చేతుల మీదుగా సత్యం సెంటర్ గురుద్వారా కూడలి మధ్య శాంతిపురం వద్ద హైవే పక్కన శిలాఫలకం వేసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ మొక్కలు పెరిగి పెద్ద వృక్షాలుగా మారి పర్యావరణ పరిరక్షణకు, నగరంలో నానాటికి పెరుగుతున్న కాలుష్యానికి అడ్డుకట్ట వేసే లా గ్రీన్‌బెల్ట్ రక్షణగా నిలుస్తోంది. అటువంటి ప్రాంతంలో నేడు పచ్చని చెట్లు మాయమై.. నేల చదునై ఆట స్థలాలుగా మారిపోవడంతో పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పటి మేయర్ సబ్బంహరి గ్రీన్‌బెల్ట్ అభివృద్ధికి వేసిన శిలాఫలకం సాక్షిగా నేడు ఆ ప్రాంతంలో పచ్చదనం మాయమై ఆట స్థలంగా మారిపోయింది.

పట్టించుకోని హార్టికల్చర్ విభాగం..

నగరంలో పచ్చదనం పరిరక్షణ, అభివృద్ధిని పర్యవేక్షించాల్సిన హార్టికల్చర్ విభాగం పర్యవేక్షణ కొరవడింది. హైవేను ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్‌లో పచ్చదనం మాయమవుతున్నా.. చెట్లు నరికి తగలబెట్టి చదును చేసి ఆట స్థలాలుగా మారుస్తున్నా అడ్డుకోవాల్సిన హార్టికల్చర్ విభాగం చోద్యం చూస్తోందని పలువురు విమర్శిస్తున్నారు. గ్రీన్‌బెల్ట్ ఏర్పాటుకు 1998లో వేసిన శిలాఫలకం ప్రాంతంలో పచ్చదనం కనుమరుగైనప్పటికీ అధికార యంత్రాంగం పట్టనట్టు వ్యవహరిస్తోంది. అధికారులు మేల్కొని గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో పచ్చదనం పరిరక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా దుర్గాగణపతి ఆలయ వార్షికోత్సవం


దుర్గాగణపతి ఉత్సవమూర్తి పల్లకీ ఊరేగింపును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: సీతంపేట కూడలిలో కొలువైన దుర్గాగణపతి ఆలయ 33వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, ప్రత్యేక అలంకరణ, గణపతి హోమం, విశేష పూజా కార్యక్రమాలు జరిపారు. సాయంత్రం 108 క్షీర కలశాలతో స్వామి వారి ఉత్సవ విగ్రహ ఊరేగింపు పురవీధుల్లో కనుల పండువగా సాగింది. 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, జగదీశ్వరి దంపతులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. అనంతరం పల్లకీ ఊరేగింపును ప్రారంభించారు.

పేద మహిళలకు చీరల పంపిణీ


చిరువ్యాపారికి చీర అందిస్తున్న కీర్తి పట్నాయక్

మురళీనగర్: మురళీనగర్ శ్రీదేవి విజ్ఞాన జ్యోతి ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం పేద మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మురళీనగర్ పరిసరాల్లోని 30 మంది పారిశుద్ధ్య కార్మికులు, నిరుపేదలు, చిరువ్యాపారులైన మహిళలకు ట్రస్టు వ్యవస్థాపకురాలు కె.కీర్తి పట్నాయక్ చీరలు, స్వీట్లు, చాక్‌లెట్లు అందించారు. చారిటబుల్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాతృభాషతోనే భావ వ్యక్తీకరణ


మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

సీతంపేట: మనసులోని భావాలను ఎదుటి వారికి కచ్చితంగా చెప్పాలంటే మాతృభాష తప్పనిసరని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం జరిగిన బాలబాట బాలల మాసపత్రిక 18వ వార్షికోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. తెలుగు తనకు చాలా ఇష్టమైన భాషని, అందుకే తెలుగు నేర్చుకున్నానని తెలిపారు. తెలుగులో పుట్టిన వారే కొన్ని తెలుగు పదాలు చెప్పలేకపోతున్నారని, మాతృ భాషపై విద్యార్థి దశలోనే పట్టు సాధించాలన్నారు. బాలల కోసం తన సొంత నిధులతో 18 ఏళ్లుగా బాలబాట మాసపత్రిక నిర్వహించడం, బాలలు తెలుగు భాష, సాహిత్యం, కవిత్వంపై పట్టు సాధించేలా ప్రోత్సహిస్తున్న కొల్లూరి స్వరాజ్యం వెంకట రమణమ్మను అభినందించారు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ బాలల సాహిత్యంపై పుస్తకాలు తక్కువగా ఉంటున్నాయని, పిల్లల్లో పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించాలన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ పిల్లల్లో సంస్కృతిని పెంపొందించడానికి బాల సాహిత్యం అవసరమన్నారు. ద్వాదశి రామలక్ష్మి రచించిన 'బాల గేయ మాలిక' పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. విశాఖకు చెందిన యువ చిత్రకారుడు శశాంక్, పలాసకు చెందిన రచయిత తెప్పల కృష్ణమూర్తిని బాలబాట తరఫున సన్మానించారు. బాలబాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రైల్వే హాస్పిటల్‌కు ఈకార్వో వితరణ


మల్టీ పారా మానిటర్స్‌ను ప్రారంభిస్తున్న ఈకార్వో ప్రెసిడెంట్ జ్యోత్స్న బోహ్రా

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ జ్యోత్స్న బోహ్రా నేతృత్వంలో శనివారం డివిజనల్ రైల్వే హాస్పటల్‌లోని రోగులకు పండ్లు, హెల్త్ డ్రింక్స్ పంపిణీ చేశారు. డీఆర్‌ఎం లలిత్ బోహ్రా, హాస్పిటల్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శరత్‌బాబులతో కలిసి ఈకార్వో ప్రతినిధులు హాస్పిటల్‌లో పర్యటించారు. రోగులను పరామర్శించి, వారికి అందుతున్న సేవలు, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందించే సేవలను విస్తృత పరిచేందుకు, హాస్పిటల్‌కు ఈకార్వో ప్రతినిధులు మల్టీ పారా మానిటర్స్‌ను వితరణ చేశారు. కార్యక్రమంలో ఈకార్వో వైస్ ప్రెసిడెంట్స్, ప్రతినిధులు, డాక్టర్స్, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

రహదారులు జలమయం


గురుద్వారా బస్ బే వద్ద గోతిలో నిలిచిన వర్షపు నీరు

సీతంపేట: అల్పపీడన ప్రభావంతో వాతావరణం కాస్త చల్లబడటంతో నగరవాసులు ఉపశమనం పొందారు. శనివారం ఉదయం చిన్నపాటి వర్షం కురిసింది. ఆ తర్వాత సాయంత్రం వరకు ఎండ తీవ్రత లేకపోవడంతో జనం సేద తీరారు. రాత్రి 8 గంటల ప్రాంతంలో ఉరుములు మెరుపులతో ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. ముఖ్యంగా అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలో మూడడుగుల లోతున వర్షపు నీరు ప్రవహించి చెరువును తలపించింది. ఈ మార్గంలో పాదచారులు, వాహనాల రాకపోకలు కష్టతరంగా సాగాయి. వివిధ పనుల మీద బయటకు వెళ్లిన వారు వర్షంలో తడవకుండా ఆశ్రయం కోసం పరుగులు తీశారు. సీతంపేట, శంకరమఠం రోడ్, అక్కయ్యపాలెం, గురుద్వారా బస్ స్టాపు ప్రాంతాల్లో వాన నీరు నిలిచిపోయింది.



జలమయమైన అక్కయ్యపాలెం మెయిన్ రోడ్

భజరే నందగోపాల హరే..

- వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు
- రాధాకృష్ణుల వేషధారణల్లో అలరించిన చిన్నారులు


లలితా పీఠంలో పూజలందుకున్న రాధాకృష్ణులు


సీతంపేట పార్వతీశ్వరాలయంలో లక్ష తులసి పూజ


సీతంపేట రాధాకృష్ణ ఆలయంలో పూజలందుకున్న నందగోపాలుడు


గోపాలుడిని పూజిస్తున్న చిన్నారి గోపిక


శ్రీకృష్ణ, గోపిక వేషధారణల్లో లిఖిత్ కుమార్, సాన్వి సాయి

సీతంపేట: శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం నియోజకవర్గంలో వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులోని వేణుగోపాల స్వామి ఆలయంలో సత్యభామ, రుక్మిణి సమేత వేణుగోపాల స్వామిని భక్తులు దర్శించుకున్నారు. లలితా నగర్ శ్రీలలితా పీఠంలో రాధాకృష్ణులకు విశేష పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం పీఠంలో అన్నప్రసాద వితరణ చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

➡ సీతంపేట గణేష్‌నగర్ పార్వతీశ్వరాలయంలో అర్చకుడు భాస్కర శర్మ చేతుల మీదుగా ఉదయం స్వామివారికి క్షీరాభిషేకం జరిపారు. సాయంత్రం స్వామి వారికి లక్ష తులసీదళాలతో శాస్త్రోక్తంగా పూజలు చేశారు.

➡ సీతంపేట రాధాకృష్ణ ఆలయంలో విశేష పూజలు, సహస్ర నామార్చనలు, పంచామృతాభిషేకాలు జరిపారు. రాధాకృష్ణులు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఉట్టి కొట్టే సంబరం కోలాహలంగా సాగింది.

చిన్నికృష్ణుల సందడి

స్థానిక చిన్నారులు రాధాకృష్ణులు, గోపికల వేషాలు ధరించి సందడి చేశారు. ద్వారకానగర్ శ్రీకృష్ణ విద్యా మందిర్‌లో నిర్వహించిన బాల గోకులం కార్యక్రమం అలరించింది. బాల గోపాలుడి వేషధారణ పోటీలో పలువురు చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీకృష్ణుడు, రాధా, గోపికల వేషధారణల్లో ఆకట్టుకున్నారు.

శ్రీకృష్ణ మందిరాల్లో విశేష పూజలు

కంచరపాలెం: స్థానిక జ్ఞానవానగర్, గోకుల్‌నగర్, బర్మా క్యాంప్, ఇందిరానగర్, 104 ఏరియా బాపూజీనగర్, ఐటీఐ కూడలి, ఊర్వశి జంక్షన్ ప్రాంతాల్లోని శ్రీకృష్ణ మందిరాల్లో ఘనంగా జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. జ్ఞానవానగర్‌లో శ్రీకృష్ణుడికి ఐఎన్‌టీయూసీ నాయకుడు గుమ్మిడి ఆదినారాయణ ప్రత్యేక పూజలు చేశారు. బాపూజీనగర్‌లో చిన్నారులు నిర్వహించిన వేడుకల్లో అమెరికా దేశానికి చెందిన చిన్నారి చిన్నికృష్ణుడి వేషధారణలో వెన్న తింటూ అందరినీ ఆకట్టుకున్నాడు. ఆయా మందిరాల వద్ద కృష్ణ వేషధారణ పోటీలు, ఉట్టి సంబరాలు సందడిగా జరిగాయి.

రైల్వే ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో..

తాటిచెట్లపాలెం: యదువంశీ రైల్వే ఎంప్లాయీస్ స్పిరిచ్యువల్, కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాటిచెట్లపాలెంలోని శుభం ఫంక్షన్ హాల్‌లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీఆర్‌ఎం లలిత్ బోహ్రా, ఈకార్వో ప్రెసిడెంట్ జ్యోత్స్న బోహ్రా అతిథులుగా హాజరై సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. రైల్వే అధికారులు, సిబ్బందికి ప్రసాద వితరణ చేశారు.

➡ తాటిచెట్లపాలెం విశ్వతేజ స్కూల్‌లో విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో సందడి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. స్కూల్ డైరెక్టర్ ఐ.భాస్కరరావు, ప్రిన్సిపాల్ ఐ.సునీత, ఇన్‌చార్జి మేడం ఎం.ఇందిరాదేవి, ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సుగంధ ద్రవ్యాభిషేకం

మురళీనగర్: బర్మా కాలనీ శ్రీనివాస నగర్‌లోని గోపాలకృష్ణ ఆలయంలో స్వామికి బూర రామారావు దంపతులు, నమ్మి రాజగోపాల్ దంపతుల ఆధ్వర్యంలో సుగంధ ద్రవ్యాలతో పంచామృతాభిషేకం చేశారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పూర్వ అధ్యక్షుడు ఒమ్మి నారాయణరావు, భరణికాన రామారావు, పి.పద్మావతి, బమ్మిడి రామారావు, నమ్మి శివప్రసాద్ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ నెల 18 వరకు ఉత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు కొండదేవతల మహిళా కోలాట బృందం కోలాటాలు ప్రదర్శిస్తారు.

➡ మాధవధారలోని మాధవ్‌నగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో చిన్నారులు గోపికా కృష్ణుల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఉట్టి కొట్టే సంబరంలో స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంఎస్‌ఆర్ పార్కు అధ్యక్షుడు ఎ.నారాయణరావు, కార్యదర్శి బి.శ్రీను, నూకరాజు, ఎస్ఎస్ రావు, ప్రసాద్, చౌదరి అప్పారావు కార్యక్రమ నిర్వహణకు సహకరించారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి.


బాపూజీనగర్‌లో వెన్న తింటున్న చిన్నికృష్ణుడు


శ్రీనివాసనగర్‌లో గోపాలకృష్ణ స్వామి


కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా, రైల్వే అధికారులు, సిబ్బంది


తాటిచెట్లపాలెం స్కూల్‌లో చిన్నికృష్ణులు, గోపికల సందడి


మాధవ్‌నగర్‌లో అలరిస్తున్న చిన్నికృష్ణ, గోపికలు




శ్రీకృష్ణ విద్యా మందిర్‌లో బాల గోకులం కృష్ణుడి వేషధారణ పోటీలను తిలకిస్తున్న చిన్నారులు, తల్లిదండ్రులు


శ్రీకృష్ణుడి వేషధారణలో విద్యార్థి

ఫల అలంకరణలో కల్యాణ వెంకన్న, పద్మావతి


లలితా పీఠంలో పండ్లతో అలంకరించిన కల్యాణ వేంకటేశ్వర స్వామి


పద్మావతి అమ్మవారు

సీతంపేట: శ్రావణ మాసం నాలుగో శనివారం సందర్భంగా లలితానగర్ శ్రీలలితా పీఠంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, సాయంత్రం సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు. ఈ సందర్భంగా వెంకన్న, పద్మావతి అమ్మవార్లను పలు రకాల పండ్లతో అలంకరించారు. పీఠం దర్బారు హాల్‌లో పండితుల వేదమంత్రాల నడుమ చండీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఐదుగురు నిరాశ్రయుల అప్పగింత

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కప్పరాడలోని మాతృ ప్రేమ వృద్ధాశ్రమంలో చేరిన అభాగ్యుల్లో ఐదుగురిని వారి కుటుంబ సభ్యులకు శనివారం కంచరపాలెం ఎస్ఐ దివ్యభారతి సమక్షంలో సంస్థ నిర్వాహకురాలు వై.మమత అప్పగించారు. వీరిలో తెనాలికి చెందిన కోటేశ్వరమ్మ సమాచారాన్ని కూతురు, కోడలికి అందించారు, నరసరావుపేటలో ఒకే కుటుంబానికి చెందిన పి.దుర్గ, కోటమ్మ, డి.దుర్గ, సిహెచ్.అలివేలు వృద్ధులను వారి కుటుంబ సభ్యులు సమాచారం అందించి అప్పగించినట్లు మమత తెలిపారు. ఆయా కుటుంబాల సభ్యులు సంస్థ సభ్యులకు, పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.


ఎస్ఐ దివ్యభారతి సమక్షంలో నిరాశ్రయులను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న మమత

వైభవుడికి పూజలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు.